# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 16-01-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ విశ్వవిద్యాలయాలు చేసే పరిశోధనలు రైతుల జీవితాలను పూర్తిగా మారుస్తాయని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖర్ పేర్కొన్నారు.
- ❖ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, పెన్షనర్ల అలవెన్సుల సవరణ కోసం 8వ వేతన కమిషన్ నియామకానికి కేంద్రమంత్రి వర్గం ఆమోదించింది.
- ❖ స్పేడెక్స్ డాకింగ్ ప్రయోగం విజయవంతమైందని ఇస్రో వెల్లడించింది.
- ❖ ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళాకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 118వ సంచిక ఈనెల 19న ప్రసారమవుతుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

విశ్వవిద్యాలయాలు చేసే పరిశోధనలు రైతుల జీవితాలను పూర్తిగా మారుస్తాయని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖర్ పేర్కొన్నారు. ధార్వాడ్‌లోని అగ్రికల్చరల్ సైన్సెస్ విశ్వవిద్యాలయం, అగ్రికల్చర్ కళాశాల అమృత్ మహోత్సవ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మార్కెటింగ్, వ్యవసాయ వస్తువుల ఎగుమతికి సంబంధించి ప్రజలకు శిక్షణ ఇవ్వడంలో విశ్వవిద్యాలయం ముందుందని అన్నారు. దేశంలో వ్యవసాయ రంగం అభివృద్ధి చెందేలా చూడాలని ఉప రాష్ట్రపతి పేర్కొంటూ..

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

స్పేడెక్స్ డాకింగ్ ప్రయోగం విజయవంతమైందని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఈ రోజు ప్రకటించింది. అమెరికా, రష్యా, చైనా తర్వాత ఈ చారిత్రాత్మక ప్రయోగాన్ని చేపట్టిన 4వ దేశంగా భారత్ నిలిచింది. గత సంవత్సరం డిసెంబర్ 30న పిఎస్ఎల్వి సి-60 ద్వారా ప్రయోగించిన రెండు ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపించింది. ఈ రెండు ఉపగ్రహాలను అంతరిక్షంలోకి అనుసంధానం చేసినట్లు ఇస్రో ప్రకటించింది. క్లిష్టతరమైన డాకింగ్ విధానాన్ని ఇస్రో టెలిమెట్రీ, ట్రాకింగ్ కమాండ్ నెట్‌వర్క్ పర్యవేక్షించిందని తెలిపింది. చంద్రునిపైకి భారతీయ వ్యోమగామిని పంపడం, చంద్రుని నుండి నమూనాలను భూమిపైకి తీసుకురావడం వంటి వాటి కోసం భారతీయ అంతరిక్ష కేంద్ర నిర్వహణకు ఈ సాంకేతికత అవసరమని ఇస్రో తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, పెన్షనర్ల అలవెన్సుల సవరణ కోసం 8వ వేతన కమిషన్ నియామకానికి కేంద్రమంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ఈ వేతన కమిషన్ సిఫారసుల మేరకు వేతనాలు పెరగనున్నాయి. ఈ రోజు జరిగిన కేంద్రమంత్రి వర్గ సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఢిల్లీలో పాత్రికేయుల సమావేశంలో ప్రకటించారు. ఛైర్మన్, ఇద్దరు సభ్యులతో త్వరలో 8వ వేతన కమిషన్ నియామకం ఉంటుందని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 34 సెకన్లు)

ఇదిలా ఉండగా మరోవైపు, శ్రీహరికోటలోని షార్‌లో 3వ లాంచ్ ప్యాడ్ నిర్మాణానికి కూడా కేంద్రమంత్రి వర్గం ఆమోదం తెలిపింది. 3 వేల 985 కోట్ల రూపాయల వ్యయంతో 3వ లాంచ్ ప్యాడ్‌ను నిర్మించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో "మహా కుంభమేళా"కు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. త్రివేణీ సంగమంలో స్నానాలు చేసేందుకు ప్రపంచం నలుమూలల నుంచి భక్త కోటి ఉత్సాహంగా కదలి వస్తోంది. గడచిన మూడు రోజులలోనే 6 కోట్ల మందికిపైగా పుణ్య స్నానాలు ఆచరించారు. ఒక్క మకర సంక్రాంతి రోజునే 3.5 కోట్ల మందికి పైగా భక్తులు వచ్చినట్లుగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. కాగా, మహా కుంభమేళాలో అత్యంత కీలకమైన మౌనీ అమావాస్య ఈనెల 29న రానుంది. ఆ రోజు ఏకంగా 10 కోట్ల మంది కంటే అధికంగా భక్తులు వస్తారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ అధికారులను ఆదేశించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి హాజరయ్యే భక్తుల సంఖ్య 50 కోట్లు దాటుతుందని ఉత్తరప్రదేశ్ డీజీపీ ప్రశాంత్ కుమార్ వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 118వ సంచిక ఈనెల 19వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు ఈనెల 17వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు రాష్ట్రపతి భవన్‌లో సింగపూర్ అధ్యక్షులు ధర్మన్ షణ్ముగరత్నానికి లాంఛనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగపూర్ అధ్యక్షులు ధర్మన్ షణ్ముగరత్నం పాత్రికేయులతో మాట్లాడుతూ... సాంకేతిక రంగంలో రెండు దేశాలు కొత్త

కార్యక్రమాలను అన్వేషిస్తున్నాయని అన్నారు. వ్యాపారం, రక్షణ, నైపుణ్యం రంగాలలో ఇరు దేశాల మధ్య సంబంధాలు చాలా ఏళ్లుగా క్రియాశీలంగా ఉన్నాయని గుర్తు చేశారు. 1965లో సింగపూర్ స్వాతంత్ర్యాన్ని గుర్తించిన మొదటి కొన్ని దేశాలలో భారత్ కూడా ఒకటని అన్నారు. అప్పటి నుంచి ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింతగా పెరిగాయని ఆయన పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

న్యూఢిల్లీలో ఈ సంవత్సరం నిర్వహించే 76వ గణతంత్ర వేడుకలకు ఇండోనేషియా అధ్యక్షులు ప్రబోవో సుబియాంటో ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని అధికార వర్గాలు తెలిపాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు అధ్యక్షులు సుబియాంటో ఈ నెల 25, 26వ తేదీలలో భారత పర్యటనకు రానున్నారు. గత ఏడాది అక్టోబర్ లో పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇండోనేషియా అధ్యక్షులు భారతదేశానికి రావడం ఇదే తొలిసారి. ఈ పర్యటన సందర్భంగా రెండు దేశాలకు చెందిన అగ్ర నేతలు ద్వైపాక్షిక సంబంధాలపై సమగ్ర సమీక్షతో పాటు.. ప్రాంతీయ ప్రపంచ సమస్యలపై చర్చిస్తారని అధికార వర్గాలు తెలిపాయి. అదే సమయంలో భారతదేశం ఇండోనేషియా స్నేహపూర్వక సంబంధాలను మరింతగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తాయని పేర్కొన్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఎంబీబీఎస్ సహా యూజీ-వైద్య విద్యాకోర్సుల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే నీట్ (NEET)పై జాతీయ పరీక్షా సంస్థ (ఎన్టీఏ) కీలక ప్రకటన చేసింది. ఒకే రోజు ఒకే షిఫ్ట్ లో పెన్- పేపర్ మోడ్ (ఓఎంఆర్ బేస్డ్)లో నీట్ పరీక్ష నిర్వహిస్తామని తెలిపింది. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ఖరారు చేసిన మార్గదర్శకాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నది. ఎంబీబీఎస్‌తో పాటు బీఏఎంఎస్, బీయూఎంఎస్, బీఎస్ఎంఎస్ కోర్సులకు యూనిఫామ్ నీట్ (యూజీ) పరీక్ష నిర్వహిస్తామని ఎన్టీఏ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ రోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 76 వేల 724 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై.. చివరకు 318 పాయింట్ల లాభంతో 77 వేల 042 వద్ద ముగిసింది. నిఫ్టీ 98.60 పాయింట్ల లాభంతో 23 వేల 311.80 వద్ద ముగిసింది. అలాగే డాలరుతో రూపాయి మారకం విలువ 86.56 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 81.86 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2 వేల 735.40 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

మాజీ ఆర్మీ అధిపతి, కేంద్ర సహాయ మంత్రి జనరల్ విజయ్ కుమార్ సింగ్ ఈరోజు మిజోరాం 25వ గవర్నర్ గా ప్రమాణం చేశారు. ఐజ్వాల్‌లోని రాజ్‌భవన్‌లో గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ విజయ్ బిష్ణోయ్ జనరల్ సింగ్‌తో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి లాల్దు హోమా, ఆయన మంత్రివర్గ సహచరులు, అసెంబ్లీ స్పీకర్ లాల్బియాక్జామా, మాజీ ముఖ్యమంత్రులు ఇతర నాయకులు హాజరయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ కె.వినోద్ చంద్రన్ ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు. జస్టిస్ చంద్రన్‌తో భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా ప్రమాణం చేయించారు. సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫారసు మేరకు ఆయనను సుప్రీంకోర్టులో నియమించేందుకు కేంద్రం అనుమతినిచ్చింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = =